ఈకేవైసీకి మరో చాన్స్‌!

- గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఏప్రిల్‌ 30 వరకు ఈకేవైసీ చేసుకోవచ్చు..
- మార్చి నెలాఖరుతో ముగిసిన గత గడువు



విజయనగరం: రేషన్‌కార్డుదారుల ఈకేవైసీకి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఏప్రిల్‌ 30వ తేదీలోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ గడువు మార్చి 30వ తేదీ వరకే ఉండగా, ఇప్పుడు ఆ గడువు పొడిగించడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కొన్నిరోజుల క్రితం ఈకేవైసీ చేసుకుంటేనే రేషన్‌ వస్తుందని.. లేకపోతే లేదన్న ప్రచారం జోరుగా సాగింది. దీంతో లబ్ధిదారులంతా ఈకేవైసీ చేయించుకోవడానికి సచివాలయాలు, రేషన్‌ డిపోల వద్దకు పరుగులు తీశారు. కార్డులో ఎంతమంది ఉంటే అంతమంది ఈకేవైసీ చేసుకోవాలని కచ్చితంగా చెప్పడంతో ఊరిలో ఉన్న వారి ఈకేవైసీ అయితే అయిపోద్ది.. ఉపాధి కోసం వలసబాట పట్టిన వారి ఈకేవైసీ ఎలా అని కుటుంబ సభ్యులు తలలు పట్టుకున్నారు. ఇదేం ప్రభుత్వం రా.. బాబోయ్‌ అని మొత్రోమన్నారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ గడువు పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్డుదారులకు కాస్త ఉపశమనం ఇచ్చింది.

మొత్తం రేషన్‌కార్డులు 77,256..

విజయనగరం కార్పొరేషన్‌తో పాటు ఇదే మండలంలో మొత్తం 77,256 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆయా కార్డుల్లో 2,12,977 మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు వీరిలో 2 లక్షల మంది ఈకేవైసీ చేసుకోగా, మరో 12 వేల మంది ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉంది.

ఎవరెవరు చేసుకోవాలో చెప్పట్లేదు..

రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ చేయించాలని కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టులు చెప్పడంతో అధికార యంత్రాంగం ఈ చర్యలకు ఉపక్రమించింది. అయితే ఎవరిది ఈకేవైసీ అవ్వలేదో వారే ఈకేవైసీ చేసుకోవాలి. దీనికి సంబంధించిన జాబితా కూడా ఇప్పటికే రేషన్‌షాపు డీలర్లు, వీఆర్‌వోలకు పంపించారు. అయితే వారు ఎవరు ఈకేవైసీ చేయించుకోవాలన్న దానిని ఎవరికీ చెప్పడం లేదు. దీంతో గందరగోళం నెలకొంది. కార్డులోని సభ్యులంతా ఈకేవైసీకి సిద్ధమైపోతున్నారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఊరొచ్చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఆ వ్యక్తిది ఈకేవైసీ చేసే ఉందని తెలియడంతో అనవసరంగా పనులు మానుకుని వచ్చామే అని దిగాలుగా వెళ్తున్న పరిస్థితి. మొత్తానికి ఈకేవైసీ నమోదుకు సంబంధించి, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

చిన్నారుల వేలిముద్రల అప్‌డేట్‌..

రానున్న రోజుల్లోనూ ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్‌ సరుకుల పంపిణీకి అధికార యంత్రాంగం యోచిస్తోంది. కార్డుదారులు ఈ–పోస్‌ యంత్రంలో వేలిముద్రలు వేస్తే చాలు రేషన్‌ వస్తుంది. అదే సమయంలో ఈకేవైసీ అప్‌డేట్‌ అవ్వని వారి వివరాలు కూడా తెలిసే అవకాశం ఉంటుంది. ఆ వివరాలు తెలిస్తే చాలు ఎవరెవరు ఈకేవైసీ చేయించుకోవాలో తెలిసిపోతుంది. అప్పుడు ఈకేవైసీ నమోదు సులువవుతుంది. అలాగే ఐదేళ్ల వయసు చిన్నారుల ఆధార్‌ అప్‌డేట్‌ చేయాల్సి ఉందని సీఎస్‌డీటీ రామారావు తెలిపారు.

వైభవంగా ఉగాది, రంజాన్‌ వేడుకలు



హిందూ ముస్లిం పెద్దలను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్‌: స్థానిక గాజులరేగ శాఖా గ్రంథాలయంలో గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్‌ వేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు చెప్పుకుని, అందరూ ఆనందంగా గడిపారు. అలాగే ముస్లిం సోదరులకు రంజాన్‌ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ముస్లిం సోదరభావానికి ప్రతీకగా ఇలా రెండు పండగలను ఒకేచోట చేసుకున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన పిల్లలకు కార్పొరేటర్లు ఎస్‌.ఆదినారాయణ, కె.రాధామణిల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అలాగే హిందూ, ముస్లిం పెద్దలైన ఎస్‌.రామానాయుడు, మహమ్మద్‌ హబీబ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వి.చిన్నదేవి, ఖైరున్నీషా, లైబ్రేరియన్‌ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

‘మన్‌కీబాత్‌’ని వీక్షించిన బీజేపీ నేతలు



మన్‌కీ బాత్‌ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లిమర్ల: నగరంలో ప్రధాని మన్‌కీ బాత్‌ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని నియోజకవర్గ బీజేపీ నేతలంతా ఆదివారం వీక్షించారు. ప్రజలందరికీ ప్రధానమంత్రి మోదీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారని నేతలు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్‌ బూర్లె శ్రీధర్‌, మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్‌, ప్రధాన కార్యదర్శి చందక గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఇది ఏ ఊరు?

- కానరాని రోడ్ల పక్క గ్రామాల నేమ్‌బోర్డులు
- కొన్నిచోట్ల చెరిగిపోయి.. మరికొన్నిచోట్ల అస్పష్టంగా..
- ఇంకొన్నిచోట్ల డొంకల్లో కనీకనిపించనట్టుగా బోర్డులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



పూర్తిగా ధ్వంసమైన సంతకవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం నేమ్‌బోర్డు

రాజాం: ఇది ఫలానా గ్రామం.. ఇంకొంచెం దూరం వెళ్తే ఫలాన ఊరు వస్తుందని తెలిపే నేమ్‌బోర్డులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. రోడ్ల పక్క ఊర్ల పేర్లు తెలిపే బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడో ఓ చోట ఉన్నా ఆ బోర్డుపై ఉన్న ఊరి పేరు అంత స్పష్టంగా ఉండడం లేదు. కొన్నిచోట్ల బోర్డుల మీద ఉండాల్సిన పేర్లు పూర్తిగా చెరిగిపోతే.. మరికొన్నిచోట్ల పేరులోని ఏదో అక్షరం లేకుండా పూర్తిగా ఊరి పేరే మారేలా ఉంటున్నాయి. ఇంకొన్నిచోట్ల ముళ్లపొదలు, డొంకలు, చెట్లకొమ్మల చాటున బోర్డులు దర్శనమిస్తున్నాయి. వాటి దగ్గరకు వెళ్తే గానీ అక్కడో బోర్డు ఉందని తెలియడం లేదు. దీనివల్ల ప్రయాణికులు, కొత్తగా ఆ రోడ్డులో ప్రయాణం చేసే వారు ఊరి పేర్లు తెలియక.. ఎంత దూరం వెళ్తే ఏ ఊరు వస్తాదన్న విషయాలు తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేసవిలో మరమ్మతులు చేయాలి..

ఏటా వేసవిలో రోడ్లు పక్కన పాడైన నేమ్‌బోర్డుల మరమ్మతులు చేపట్టాలి. అవసరమైనచోట కొత్త వాటిని ఏర్పాటు చేయాలి. ప్రధాన రహదారి కూడళ్లలో ఈ బోర్డులదే ప్రధాన పాత్ర. గ్రామాల ఆరంభం, శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డులేవీ ఇప్పుడు లేవు. గతేడాది వరకు ఉన్న వీటి నిర్వహణ ఇప్పుడు లేదు. ఒక్కో గ్రామం వద్ద ఈ బోర్డుల ఏర్పాటుకు రూ.1200లు వరకు ఖర్చు చేస్తారు. ఏటా వీటి నిర్వహణతో పాటు కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరవుతాయి. ఈ లెక్కన ఈ ఏడాది బోర్డుల కోసం కేటాయించిన నిధులు ఏమైనట్లు అని అందరూ ప్రశ్నిస్తున్నారు.

బోర్డు లేక దారి తప్పుతున్నారు..

రాజాం నియోజకవర్గం నుంచి అటు వంగర, ఇటు సంతకవిటి, మరోవైపు రేగిడి తదితర మండలాలకు వెళ్లే ప్రధాన రహదారులు ఉన్నాయి. వంగరలో ప్రధాన రహదారి ఆనుకుని ఒకటో రెండు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లోని కూడళ్ల వద్ద నేమ్‌బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఒక గ్రామానికి వెళ్లాల్సిన వారు ఇంకో గ్రామానికి వెళ్తున్నారు. కొంతమంది ఏ గ్రామం ఏదో కొంతసేపు అటు ఇటూ తిరగాల్సిన దుస్థితి. సంతకవిటి, రేగిడి మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. సంతకవిటి మండలం, రంగారాయపురం ప్రధాన రహదారికి చాలా దూరంగా ఉంది. ఇక్కడి కూడలిలో కూడా ప్రయాణికులను దిశానిర్దేశం చేసేలా నేమ్‌బోర్డు లేదు.

బోర్డులపై తీగలు అల్లేస్తున్నాయి..

గతేడాది వేసవితో పాటు ఈ ఏడాది వేసవిలో కూడా రోడ్డుకు ఇరువైపులా చేపట్టాల్సిన జంగిల్‌ క్లియరెన్స్‌ పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు చేయలేదు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న ఊరి పేర్లు తెలిపే బోర్డులపై డొంకలు, తుప్పలు, తీగలు అల్లేసి అవి కనిపించకుండా పోతున్నాయి. బోర్డు మొత్తం కొన్ని కలుపుమొక్కల తీగలు పూర్తిగా అల్లేయడంతో వాటిపై పేర్లు ఉన్నట్టే కాదు.. అక్కడ బోర్డు ఉన్నట్టు కూడా దగ్గరకు వెళ్తే తప్ప కానరావడం లేదు.

పాడైన బోర్డులు బాగుచేస్తాం..

గ్రామాల దగ్గర రోడ్లుకు ఆనుకుని ఉన్న ఊరి నేమ్‌బోర్డులు బాగుండేలా చూస్తాం. పాడైన వాటిని బాగు చేయించి, ప్రదర్శిస్తాం. అన్ని ఊరి పేర్ల బోర్డులు సరిగా ఉండేలా చర్యలు చేపడతాం. తుప్పు పట్టి ధ్వంసమైన వాటి చోట కొత్త బోర్డులు పెడతాం.

– డీవీ ప్రసాద్‌, ఆర్‌అండ్‌బీ డీఈఈ, రాజాం



వంగర రోడ్డులోని కోడిశ గ్రామ నేమ్‌బోర్డు ఇలా..



ముళ్లపొదల్లో రాజాం మండలంలోని రాజీపేట వద్ద నేమ్‌బోర్డు



కనీకనిపించనట్టుగా రేగిడి మండలంలోని కాగితాపల్లి నేమ్‌బోర్డు



తీగమొక్కలతో నిండిన రేగిడి మండలంలోని బూరాడ జంక్షన్‌ వద్ద బోర్డు



జంగిల్స్‌ కారణంగా స్పష్టంగా కనిపించని ఖండ్యాం–తాటిపాడు గ్రామాల కూడలి వద్ద నేమ్‌బోర్డు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతుగా పాణిరాజు



సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పాణిరాజు

విజయనగరం ఫోర్ట్‌: రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతుగా జిల్లాకు చెందిన కలిదిండి వెంకట సూర్యనారాయణ(పాణిరాజు) ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. పంటల సాగు, కొత్త వ్యవసాయ విధానాల ఆవిష్కరణలో చేసిన విశేష కృషికి గాను ఆయనకు ఈ అరుదైన పురస్కారం లభించినట్లు సమాచారం.

చలివేంద్రం ప్రారంభం



పంపిణీకి మజ్జిగ ప్యాకెట్లతో సిద్ధంగా ఉన్న సంఘ సభ్యులు, తదితరులు

విజయనగరం: ఉగాది పురస్కరించుకుని, నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో మదర్‌ థెరీసా సేవా సంఘ సభ్యులు ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమం చేస్తున్నామని ఆ సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్‌ పట్నాయక్‌ తెలిపారు. అనంతరం అటువైపుగా వెళ్లే ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, సాయికృష్ణ వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాల ఐక్యతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్‌

విజయనగరం టౌన్‌: బ్రాహ్మణ సంఘాల ఐక్యతకు కృషి చేయాలని వక్త డీవీ శ్రీకాంత్‌ కోరారు. స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు, జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాసరావు.. నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులకు కాన్వెంట్లగా స్కాలర్‌షిప్‌లు, వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గన్నవరపు శ్రీనివాస్‌, సరోజిని, దవళ సర్వేశ్వరరావు, కట్టమూరి చంద్రశేఖరం, వాడ్రేవు శ్రీనివాస్‌, సరిపల్లి శ్రీనివాస్‌, భద్రాద్రి, కిరణ్మయి, రామ్‌కుమార్‌, ప్రభు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పద సంచాలన్‌ ర్యాలీ

బొబ్బిలి: పట్టణ వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్‌(రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌) పద సంచాలన్‌ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ కేశవ్‌ బలిరాం హెడ్గేవర్‌ జయంతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు పురవీధుల్లో తిరిగారు.

ఉత్తమ సేవలకు ఉగాది పురస్కారం

బాడంగి: బొబ్బిలిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన పలువురికి పాతబొబ్బిలికి చెందిన స్వచ్ఛంద సంస్థ వారు ఆదివారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. బాడంగి మండలంలోని కోడూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, భారత, భాగవత ప్రవచనకారుడు, కళాకారుడు కలిగట్ల బాబూరావు కూడా ఆ పురస్కారం పొందారు. దివ్యాంగులైనప్పటికీ వైద్యసేవలతో పాటు ప్రవచనాలు చెప్పడంలోనూ నాటకాలు వేయడంలోనూ తనదైన ప్రతిభ కనబరుస్తూ ఆకట్టుకుంటున్నారని వక్తలు బాబూరావును ప్రశంసించారు.

కొప్పరవలసలో నిత్యాన్నదానం



మాట్లాడుతున్న సాదెం వెంకటరమణ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో తిరుపతి నవజీవన్‌ ట్రస్ట్‌కు చెందిన ఆచార్య కె.శ్రీధర్‌ ఆర్థికసాయంతో నిత్యాన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. అమృత కలశం పేరిట ప్రతిరోజూ నిత్యాన్నదానం చేపట్టి కొప్పరవలస, మద్దివలస, కె.కొత్తవలస గ్రామాల్లోని దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలకు క్యారేజీల ద్వారా భోజనం అందివ్వనున్నామని ట్రస్ట్‌ చీఫ్‌ మేనేజర్‌ సాదెం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సీతారాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



పూసపాటిరేగ: కోనాడలో పంచాంగం చదివి వినిపిస్తున్న వేదపండితుడు



డెంకాడ: నాతవలసలో పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్తులు

వాడవాడలా ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. భక్తులు ఆలయాలకు చేరుకుని, విశేష పూజలు చేశారు. పూజారులు, పండితులు చేసిన పంచాంగ పఠనం శ్రద్ధగా విని, కొత్త ఏడాది ఎలా ఉండబోతుందో తెలుసుకున్నారు. అనంతరం షడ్రుచుల ఉగాది పచ్చడి రుచి చూశారు. తెలుగు నూతన సంవత్సరాది పురస్కరించుకుని రైతులు ఏరువాక కార్యక్రమం చేపట్టారు. వేకువజామునే నాగలి, పలుగు, పార చేతబట్టి పొలానికి చేరుకుని, దుక్కి పనులు ఆరంభించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్‌



విజయనగరం: ఉగాది వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో పంచాంగ కర్త ప్రభాకరశాస్త్రిని సన్మానిస్తున్న దృశ్యం

హైందవ సంప్రదాయాలను భావితరాలకు అందివ్వాలి



శివరామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు

విజయనగరం టౌన్‌: మన హైందవ సంప్రదాయాలను భావితరాలకు అందివ్వాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయం మేడ పైన ఉన్న చా.సో.భవనంలో ఉగాది వేడుకలు సహా వాగ్దేవి సమారాధనం శ్రీపైడిమాంబ వేద సంస్కృతాంధ్ర పరిరక్షణ సేవా సంఘం నాలుగో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే.. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆయా కార్యక్రమాలను ఆరంభించారు. అనంతరం కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం సనాతన సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, అటువంటి సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సంఘ సభ్యులంతా సత్కరించారు. అలాగే పలువురు ఆంధ్రోపన్యాసకులను వాగ్దేవీ సాహితీ స్రష్ట బిరుదుతో సన్మానించారు. కార్యక్రమంలో పెన్నేటి స్వప్నహైందవి, దార్లపూడి శివరామకృష్ణ, బొంతు గురవయ్య, జి.ఎరుకునాయుడు, ఎం.సుభద్రదేవి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములు కావాలి



తుమ్మాపురంలో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్‌

నెల్లిమర్ల రూరల్‌: మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎస్‌ఐ గణేష్‌ పిలుపునిచ్చారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తమ్మాపురంలో శనివారం రాత్రి బస చేసిన ఆయన.. ప్రస్తుతం ఫ్యాషన్‌ మాయలో పడి చాలా మంది యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బెట్టింగ్‌లకు పాల్పడి ఆర్థికంగా కుదేలవుతున్నారన్నారు. గంజాయి, మద్యం, సిగరెట్‌, ఖైనీ, గుట్కా, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బస చేశారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం హర్షణీయం



జలప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన పైడితల్లి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం హర్షణీయమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. స్థానిక అమ్మవారి చదురుగుడి వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జలప్రసాదాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. అమ్మవారి దీవెనలు భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ జలప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్‌ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్‌, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, రమేష్‌పట్నాయక్‌, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో ఉన్న పేదలకు దుప్పట్లు, దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. ఉగాది పండగ సందర్భంగా రాజాంకు చెందిన రిటైర్డ్‌ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్వీ రమణారావు వాటిని 70 మందికి అందజేశారు.